క్లుప్తంగా

వైభవంగా గో కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెంలో ఉన్న శ్రీకృష్ణ గోశాలలో గో కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, గో ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలు అనంతరం భక్తులకు అన్నప్రసాదం చేశారు.

నేటితో ముగియనున్న సౌత్ ఇండియా ఎక్స్‌పో



నగలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్ ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సౌత్ ఇండియా జ్యూయలరీ ఎక్స్‌పో సోమవారంతో ముగుస్తున్నట్టు నిర్వాహకులు రూప రేఖ తెలిపారు. గోల్డ్, డైమండ్స్, ల్యాబ్ గ్రోన్ డైమండ్స్, సిల్వర్ జెమ్స్‌తో కూడిన అతిపెద్ద ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు



ఖమ్మంవైద్యవిభాగం: అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముగ్గురు అనాథలు మృతి చెందగా మృతదేహాలు, అన్నం ఫౌండేషన్‌లో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ మృతదేహాల కోసం ఎవ్వరూ రాకపోవటంతో పోలీసుల సమాచారంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో బల్లేపల్లిలోని వైకుంఠ ధామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

నేలకొండపల్లి: స్థానిక సీపీఎం కార్యాలయంలో నూతక్కి గంగాధర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో పలువురికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దండా సూర్యానారాయణ, నారాయణరావు, జమాల్ ఫాషా, వల్లంచెట్ల భాస్కర్‌రావు, సైదారావు, అబ్దుల్, ఈగ వసుంధర, హారిక, సామాల మల్లిఖార్జున్, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	సింగిల్, రెట్రో, జింఖానా
సాయిరాం	జగదేకవీరుడు అతిలోక సుందరి, తండర్‌బోల్ట్స్
ఆదిత్య	శుభం, అర్జున్ S/o వైజయంతి
శ్రీనివాస	దేశముదురు, తుడారమ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	40		20
కాకర	56	చుక్కకూర	3
బీర	50		20
దొండ	30	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	90	గోంగూర	4
గోరుచిక్కుడు	40		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	36		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	58		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

పాలన గాడిన పడేనా..?

కేఎంసీలో శానిటేషన్ సిబ్బంది పనితీరుపై అధికారుల ఆరా

- విధులకు హాజరు కాని వారి వివరాలు సేకరణ
- ఔట్ సోర్సింగ్ సిబ్బంది విభాగాల మార్పునకు కసరత్తు
- మరోసారి పైరవీలకు తెరలేపుతున్న సదరు సిబ్బంది



కేఎంసీ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)లో కొందరి ఉద్యోగులు, సిబ్బంది పెత్తనం పెరగడం అన్నీ తామే అనే చందంగా వ్యవహరిస్తుండడంతో నగర పాలక పాలన గాడి తప్పుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిని సరిచేసేందుకు ఉన్నతాధికారులు ర్యలకు ఉపక్రమించగా ఏళ్లుగా ఒకే చోట తిష్టవేసిన సదరు సిబ్బంది అక్కడ నుండి కదిలేందుకు ఇష్టపడడం లేదని తెలుస్తోంది. కార్యాలయంలో బయట తమకు ఉన్న పలుకుబడిని వినియోగించుకుని అక్కడ నుండి కదలకుండా పైరవీలు చేయిస్తున్నట్లు సమాచారం. ఇక విధులకు హాజరుకాకుండానే వేతనాలు పొందుతున్న రెగ్యులర్ వర్కర్లను గుర్తించేందుకు అధికారులు చేపట్టిన విచారణ చివరిదశకు చేరింది. సోమవారం నుండి ఔట్ సోర్సింగ్ వర్కర్ల జాబితాను పరిశీలన చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. కొన్ని నెలలుగా పలు సర్వేలు, వివిధ పనుల కారణంగా కార్యాలయ పాలనపై పూర్తి స్థాయిలో దృష్టిసారించలేకపోయిన అధికారులు తాజాగా దీనిపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

రెగ్యులర్ వర్కర్ల ఫిట్‌నెస్‌పై ఆరా

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ఆ పనులు సక్రమంగా జరిగి నగర వీధులు పరిశుభ్రంగా ఉంటాయి. కేఎంసీలో రెగ్యులర్ వర్కర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారిలో పలువురు అనారోగ్యాలు, శారీరక ఇబ్బందులతో పనులకు హాజరు కాలేకపోతున్నారు. అయితే వీరిలో కొంత మంది అసలు విధులకు రాకుండానే హాజరు నమోదు చేయించుకొని వేతనాలు పొందినట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల రెగ్యులర్ వర్కర్లను విచారించేందుకు అధికారులు కేఎంసీకి పిలువగా 70 మంది వరకు హాజరైనట్లు తెలిసింది. మిగిలిన వారిలో ఇద్దరు సస్పెన్షన్‌లో ఉండగా మరో 20 మంది విచారణకు హాజరు కాలేదని తెలిసింది. ఇక వీరిలో 16 మంది వరకు పనులకు అన్‌ఫిట్‌గా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీనిపై అధికారులు నివేదిక తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఇక పనికి రాకుండా వర్కర్లకు హాజరు నమోదు విషయంలో ఒక ఇంచార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై అధికారులు వేటు వేసినట్లు తెలిసింది. సదరు ఇంచార్జి ఎస్సైను డిమోట్ చేసి డివిజన్‌కు జవాన్‌గా పంపించినట్లు సమాచారం.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, వర్కర్లపై దృష్టి..

ఔట్ సోర్సింగ్ వర్కర్లు, కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నగర పాలకంలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న వర్కర్లు, డ్రైవర్లు వివరాలు సేకరించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. ఇక సోమవారం నుండి ఔట్ సోర్సింగ్ వర్కర్లు, సిబ్బంది, డ్రైవర్లను పిలిచి విచారణ చేయనున్నట్లు సమాచారం. ఇక శానిటేషన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ చదువుకున్నామనే కారణం చూపి కార్యాలయంకు వచ్చి తిష్టవేసిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. పారిశుద్ధ్య విభాగంలో కార్మికుల సరిపోవడం లేదని క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులు గగ్గోలు పెడుతుండగా.. పారిశుద్ధ్య పనులు చేసేందుకు వచ్చి కార్యాలయంలో పాతుకపోయిన వారిని అక్కడి నుండి కదిపేందుకు అధికారులు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.

పైరవీలకు సై..

గాడితప్పుతున్న పాలనను చక్కబెట్టేందుకు అధికారులు ఉపక్రమించిన ప్రతిసారి కొందరు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ పలుకుబడిని వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏళ్ల తరబడి పాతుకపోయిన సిబ్బంది అక్కడి నుండి కదిలేందుకు ఇష్టపడక అక్కడే కొనసాగేందుకు కార్యాలయంలో బయట తమకు ఉన్న పలుకుబడిని వినియోగించి పైరవీలకు తెరలేపుతున్నట్లు తెలిసింది. ఇటీవల కొందరి సిబ్బందిని జోనల్ కార్యాలయంలో విధులకు కేటాయించగా వారి కోసం ప్రజాప్రతినిధులు పైరవీలు చేస్తున్నట్లు చర్చ జరుగుతుంది. ఇక కార్యాలయంలో పలు విభాగాల్లో తిష్టవేసిన సిబ్బంది కోసం కార్యాలయ ఉద్యోగులే పైరవీలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయ పాలనను గాడినపెట్టేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు ఆదిలోనే పైరవీలతో అడ్డుకట్ట వేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

17న మున్సిపల్ కార్యాలయం ముట్టడి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల17న మున్సిపల్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ స్థానిక గుమస్తాల సంఘ భవనంలో యర్రా రంజిత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిందన్నారు. ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజేనేపల్లి శ్రీనివాసరావు, 31 వ డివిజన్ కార్పొరేటర్ యర్రా గోపి, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, షేక్ సైదులు,షేక్ హిమామ్, మద్ది సత్యం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ శిబిరాలు

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సోమవారం నుండి 15 రోజుల పాటు ప్రత్యేక వేసవి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ రాయల వీరస్వామి తెలిపారు. కూసుమంచిలోని ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా పాఠశాలలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని, వాటిలో భాగంగా విద్యార్థులకు చదువులో మెళకువలతో పాటు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్‌లో తర్ఫీదు, క్రీడల్లో రాణించేందుకు శిక్షణ అందించటం జరుగుతందన్నారు.

వెల్లువెత్తిన అభిమానం



శంకరగిరితండాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నేలకొండపల్లి: మండలంలోని ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అభిమానం చాటుకున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామదేవాలయం ప్రారంభం సందర్భంగా ఆదివారం గ్రామంలో జగన్ ఫ్లెక్సీలు భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. గ్రామంలో పలు చోట్ల జగన్ ఫ్లెక్సీలు ఏర్పాటు ఆసక్తిగా మారింది.

పగలు రెక్కీలు.. రాత్రి చోరీలు..

పాలేరులో వరుస ఘటనలు

- దొంగలు రెచ్చిపోతుండటంతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- ఇళ్లు, కార్యాలయాలు, ఆలయాలే టార్గెట్



ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలో దొంగలు రెచ్చిపోతూ రోజుకు రోజుకు యథేచ్ఛగా వరుస చోరీలకు పాల్పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రెక్కి నిర్వహించడం అక్కడి పరిస్థితులను బేరీజు వేసుకుని అనంతరం రాత్రి సమయాల్లో తమ పని కానిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. వరుసగా చోరీలు జరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు, ఎక్కడ దొంగతనం జరుగుతుందోననే ఆందోళనతో ప్రజలు గడుపుతున్నారు. ఇళ్లు, కార్యాలయాలు, ఆలయాలలో చొరబడి దొంగలు అందినకాడికి దోచుకుపోతున్నారు.

వరుస చోరీలతో జనం బెంబేలు.

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వరుస చోరీలు జరుగుతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా చోరులు రెచ్చిపోతుండటం, ఎక్కడ ఎప్పుడు ఏంజరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఒంటరిగా మహిళలు చేను వద్దకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ద్వి చక్ర వాహనాలపై వస్తున్న దొంగలు క్షణాల్లో తమ పని కానిచ్చి దర్జాగా వెళుతున్నారు. పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉన్నా చోరీలు మాత్రం ఆగడంలేదు. పోలీసులు పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని పలువురు కోరుతున్నారు.

వరుస చోరీలను అరికడతాం

చోరీలను అరికట్టడానికి పోలీస్‌పరంగా చర్యలు చేపట్టాం. ఎక్కడికక్కడ స్టేషన్‌లవారీగా సీఐలకు చోరీల నివారణకు ఆదేశాలు జారీ చేశాం. స్వయంగా రంగంలోకి వచ్చి పరిస్థితిని సమీక్షిస్తున్నాం. టెక్నికల్‌గా ఏమేం చేయాలో అది చేసే ప్రయత్నంలో ఉన్నాం. చోరీలు జరగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

– తిరుపతిరెడ్డి, రూరల్ ఏసీపీ.

ఇటీవల పలు ఘటనలు..

తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న డీసీసీబీ బ్యాంక్‌లో వరుసగా చోరీలు జరగడం గమనార్హం. మొదటి రోజు చోరీ జరిగిన అనంతరం పోలీసులు విచారణ జరుపుతుండగానే వారిని ఊపిరి పీల్చుకోకుండా మరుసటి రోజు రాత్రే తిరిగి అదే బ్యాంక్‌లో చోరీకి యత్నించడం చూస్తే దొంగలు ఎంతలా జంకు బొంకూ లేకుండా చోరీలు చేస్తున్నారో ఇట్టే ఊహించవచ్చు. ఈ రెండు ఘటనలు మరువకముందే కొద్దికాలానికే తిరుమలాయపాలెం మండలంలోని మహ్మదాపురంలో ఓ ఇంట్లోని వ్యక్తులు దైవదర్శనానికి వెళ్లగా దొంగలు ఆ ఇంటి తలుపులు పగలగొట్టి కొంత బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా ఖమ్మంరూరల్ మండలం నాయుడుపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో దేవుని హుండీని దొంగలు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి అది సాధ్యం కాకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయంలో చోరీ యత్నం జరగడం గమనార్హం. అదేవిధంగా కూసుమంచి మండలం పోచారం గ్రామంలో గతంలో పట్టపగలు ఓఇంట్లోకి వెళ్లిన దొంగలు ఓ మహిళను ఏమార్చి మెడలోని పుస్తెలతాడును లాక్కొని ఉడాయించారు. తాజాగా శనివారం ఇదే మండలంలోని కేశవాపురంలో బెల్లం సావిత్రి అనే మహిళ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని దొంగలు పారిపోవడం గమనార్హం. బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఇంటి ముందు నిలబడి ఉన్న ఆమెను మాటల్లో పెట్టి మెడలోని గొలుసును లాక్కొని క్షణాల్లో మాయమవడంతో దొంగలు ఎంతగా రెచ్చిపోతున్నారో ఇట్టే అర్థమవుతోంది.



డీసీసీబీ కిటికీని ధ్వంసం చేసిన దృశ్యం (ఫైల్)

మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన



పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం మండలంలో పర్యటించారు. ఈ మేరకు శంకరగిరితండా గ్రామంలో శ్రీ సీతారాముల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, బొందయ్య, ధీరావత్ బాలాజీ, దండా పుల్లయ్య, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుసంధానానికి అడుగు పడడం లేదు



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టుతో కలిపి ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు ముగ్గురు మంత్రులు ఉన్నా అడుగు ముందుకు పడడం లేదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ.. మంత్రులు సమీక్ష సమావేశాలు నిర్వహించడం తప్ప బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు మాత్రం చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ప్రాజెక్ట్ ప్రధాన కెనాల్ పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్ అనుసంధానం పనులు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఖమ్మం జిల్లాలో సాగు నీరు సమస్యలు మరింత వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు ఎస్‌కె.మీరా, గోడవర్తి నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, సహా కార్యదర్శులు రచ్చా నరసింహారావు, బిక్కసాని గంగాధర్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య కోరారు. ఆదివారం ఖమ్మం ఇల్లందు రొడ్డులో సమ్మె పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో కోట్లాదిమందిలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని, వారికి ఎలాంటి చట్టబద్ధత హక్కులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం 29 రకాల చట్టాలని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం అనేది చాలా దుర్మార్గమైనదని, కార్మికులను 12 గంటలు పని చేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నాయన్నారు. నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులైజేషన్ చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నాయకులు బొమ్మకంటి రమేష్ , పెరబోయిన వెంకన్న, రాంబాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఖమ్మంసహకారనగర్: న్యూ విజన్ కాలేజీలో సమ్మేళనంలో హాజరైన పూర్వ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని న్యూ విజన్ జూనియర్ కాలేజీలో ఏపీ రాష్ట్రంలోని ఎన్‌టీఆర్ కృష్ణాజిల్లా కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ 1972–74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 50 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన విద్యార్థులు పరస్పరంగా పలకరించుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మదర్స్ డే సందర్భంగా సీహెచ్.జీకే ప్రసాద్ తల్లిని సన్మానించారు.

ఆర్జేసీ కళాశాలలో..

నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాల 2000–2003 బీఎస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఒకే వేదికపై మళ్లీ కలిసిన విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, ఆనాటి మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఉల్లాసంగా గడిపారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య, అధ్యాపకులు శ్రీనివాస రెడ్డి, లక్ష్మణ్‌రావు, పూర్వ విద్యార్థులు రామారావు, నాగమణి, చైతన్య, సుప్రియ, వెంకటేశ్వర్లు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం జెడ్పీ పాఠశాల 2005–06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆటా, పాటలతో సందడి చేసి గురువులను ఘనంగా సన్మానించారు.



ఆర్జేసీ కాలేజీలో..



నేలకొండపల్లి: చెరువుమాధారంలో..

మొక్కల పేరుతో నిధులు స్వాహా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలకసంస్థ పరిధిలో పచ్చదనంను పెంచేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అయితే మొక్కల పేరుతో అధికారులు నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్న చర్చ కేఎంసీలో జరుగుతోంది. కేఎంసీకి అవసరమైన 4 వేల మొక్కలను ఇల్లెందు నర్సరీ నుండి ఇటీవల తెప్పించారు. నర్సరీ నుండి మొక్కలు ఉచితంగా సరఫరా చేసినా.. వాటి రవాణా ఛార్జీలను కేఎంసీ భరించింది. అయితే ఇల్లందు నుండి 3 వేల కన్న తక్కువ మొక్కలు మాత్రమే రాగా అధికారులు మాత్రం 4 వేల మొక్కలకు రవాణా చార్జీలు చెల్లించినట్లు బిల్లులు సమర్పించి, నిధులు స్వాహా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి చూసే చేరికలు



పార్టీలో చేరిన వారితో వెంకటేశ్వర్లు, తదితరులు

రఘునాథపాలెం: కాంగ్రెస్ చేపడుతున్న ప్రజా పాలనతో గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇతర పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఖమ్మం ఆత్మకమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని చిమ్మపుడి గ్రామంలో ఇతర పార్టీకి చెందిన పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో మండలం అభివృద్ధి బాటలో పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లా నాయక్, గ్రామశాఖ అధ్యక్షుడు జోనేబోయిన పాపయ్య, దశరథ్, రవి, షరీఫ్, రజబ్ అలీ, నాగిరెడ్డి, కోటేరు నర్సిరెడ్డి, యర్ర కరుణాకర్ రెడ్డి, మారం కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.